సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



వెండి వస్తువుల సమర్పణ

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి కానూరి బాలాజీ శ్రీనివాస్ దంపతులు (పెనుగొండ మండలం తామరాడ) రూ.2 లక్షల విలువైన 2.60 కిలోల వెండి శంఖుధార, చక్రధార సమర్పించారు.



రూ.1,11,111 విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి సుంకరణం శ్రీధర్, వెంకట పద్మావతి దంపతులు (పెందుర్తి) మంగళవారం రూ.1,11,111 విరాళం సమర్పించారు.

7,800 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 7,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

డీఆర్వో సత్తిబాబు బదిలీ

సాక్షి అమలాపురం: జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు బదిలీ అయ్యారు. కొత్త జిల్లా ఏర్పడిన తరువాత డీఆర్వోగా బాధ్యతలు చేపట్టిన ఆయన సమర్థవంతంగా సేవలందించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయనను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన బాపట్ల డీఆర్వోగా డిప్యూటీ కలెక్టర్ హోదాలో బదిలీ అయ్యారు. సత్తిబాబు స్థానంలో మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకటేశ్వర్లు జిల్లాకు రానున్నారు.

9న మిధున్‌రెడ్డి రాక



పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వేణుగోపాలరావు

మామిడికుదురు: పి.గన్నవరం మండలం చాకలిపాలెం శ్రీకృష్ణ బాలాజీ కన్వెన్షన్ హాల్‌లో 9వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ సమావేశం జరుగుతుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్ మిధున్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు హాజరు కావాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు

అమలాపురం టౌన్: జిల్లాలో ఇంటర్ ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా ఇంటర్ పరీక్షల ప్రత్యేకాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. మంగళవారం ఉదయం జరిగిన పరీక్షకు 1,397 మందికి 1,295, మధ్యాహ్నం పరీక్షకు 1,014కి గాను 974 మంది హాజరయ్యారు. జిల్లాలోని 16 కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఈ పరీక్షలు మూడు విడతలు జరుగుతున్నాయి. మొదటి విడత 5 నుంచి 9వ తేదీ వరకూ, రెండో విడత 11 నుంచి 15వ తేదీ, మూడో విడత 16 నుంచి 20వ తేదీ వరకూ జరుగుతాయని సోమేశ్వరరావు వివరించారు. అమలాపురం రవితేజ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు.

కారు డ్రైవర్‌కు జైలుశిక్ష

పిఠాపురం: అతి వేగంగా, అజాగ్రత్తగా కారు నడిపి ఇద్దరి మృతికి కారకుడైన డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ పిఠాపురం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.లీలా సాయి సుభాష్ మంగళవారం తీర్పు చెప్పారు. గొల్లప్రోలు పోలీసుల కథనం ప్రకారం.. శంఖవరం మండలం కత్తిపూడికి చెందిన సలపరెడ్డి పాండురంగారావు (38) తన మోటారు సైకిల్‌పై ఒక మహిళను తీసుకుని గొల్లప్రోలు మండలం కొత్త వజ్రకూటం నుంచి వస్తున్నాడు. వారిని రాజమహేంద్రవరం నుంచి కత్తిపూడి వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాండురంగారావుతో పాటు గుర్తు తెలియని ఆ మహిళ కూడా మృతి చెందింది. ఈ ప్రమాదంపై అప్పటి ఎస్సై బి.శివకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. ఈ కేసులో విశాఖ గోపాలపట్నానికి చెందిన కారు డ్రైవర్ సాలాపు సత్తిబాబును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయి సత్తిబాబుకు పైవిధంగా శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసులో ఏపీపీ ఆకుల లీలా నాగరోజా ప్రాసిక్యూషన్ నిర్వహించగా, పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్సై బాలాజీ, కోర్టు కానిస్టేబుల్ వై.రాజబాబు సహకరించారు.

18న రికార్డు అసిస్టెంట్ పోస్టులకు రాత పరీక్ష

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో రెండు రికార్డు అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఈ నెల 18న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను 2019 జూలై 16న నిర్వహించాల్సి ఉండగా కోవిడ్ కారణంగా వాయిదా వేశారన్నారు. స్థానిక గోకవరం బస్టాండ్ వద్దనున్న రాజమహేంద్రి డిగ్రీ కళాశాలలో ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ ఈ పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షకు షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా హాల్ టికెట్లు పంపించామన్నారు. దరఖాస్తులో తెలిపిన చిరునామాలో లేకపోవడం, ఇతర కారణాల వల్ల కొందరి హాల్ టికెట్లు తిరిగి సంస్థకు వచ్చాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి తమ హాల్ టికెట్లను రాజమహేంద్రవరంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో పొందవచ్చని సునీత తెలిపారు.

మంచి తరుణం

- పుడమి పుత్రులకు ఆర్థిక చేయూత
- వరికి రుణ పరపతి రూ.38 వేల నుంచి రూ.49 వేలకు పెంపు
- మొక్కజొన్న, పప్పు ధాన్యాలు, వేరుశనగకూ పెరిగిన పరపతి
- అదే బాటలో ఉద్యాన పంటలు, పాడి, మత్స్య పరిశ్రమలు



సాక్షి, అమలాపురం: నేల తల్లి పులకిస్తోంది.. సాగు సిరులు కురిపిస్తోంది.. సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పండగలా మార్చింది.. విత్తు నుంచి పండించిన పంట విక్రయించే వరకూ అన్నదాత వెంటే ఉంటోంది.. అడుగడుగునా అండగా నిలుస్తోంది. వారికి ఆర్థిక చేయూత అందిస్తోంది. ప్రతి విషయంలోనూ భరోసా కల్పిస్తోంది. రైతు భరోసా ద్వారా చిన్న, సన్నకారు రైతులకు సాధ్యమైనంత వరకూ పెట్టుబడి సాయాన్ని అందజేస్తున్న ప్రభుత్వం మధ్య తరహా.. పెద్ద రైతులకు సైతం అండగా నిలబడుతోంది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తోంది. సాగు పెట్టుబడికి అయ్యే ఖర్చులో మూడొంతులకు పైగా బ్యాంకుల ద్వారా రుణాలు అందించడం ద్వారా వారు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా చేస్తోంది. జిల్లాలో కీలకమైన వరి సాగుతో పాటు ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటలకు పెట్టుబడి అధికంగా అవుతోంది. ఇతర జిల్లాలతో పోల్చుకుంటే ఇక్కడ మరింత ఎక్కువ. పెరిగిన ఎరువులు, పురుగు మందు ధరలతోపాటు ఇక్కడ కూలీ రేట్లు కూడా అధికమే. దీనివల్ల ఇక్కడ ఉత్పత్తి వ్యయం అధికమవుతోంది. ఇది గుర్తించిన జిల్లా యంత్రాంగం రైతులకు వివిధ వాణిజ్య బ్యాంకులు, సహకార బ్యాంకుల ద్వారా ఇచ్చే సాగు రుణాలను పెంచింది. ఈ ఆర్థిక సంవత్సరంలో వచ్చే ఖరీఫ్ నుంచి వ్యవసాయ, ఉద్యాన, మత్స్య సాగు చేసే రైతులతోపాటు పశువులు, కోళ్లు పెంచే వారికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను జిల్లా సాంకేతిక కమిటీ శుక్రవారం నిర్ధారించింది. వరితోపాటు ఇంచుమించు అన్ని పంటలకు రుణ పరిమితి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీనిపట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వారు కొనియాడుతున్నారు.


ఉద్యాన పంటలు			
మిరప	32,000 – 35,000	జామ, బొప్పాయి	35,000 – 40,000
అరటి	75,000 – 85,000	కొబ్బరి, ఆయిల్‌పామ్	50,000 – 60,000
అరటి (టిష్యూ కల్చర్)	90,000 – 1,00,000	కొబ్బరి, ఆయిల్‌పామ్‌లో కోకో	75,000 – 95,000
మామిడి	30,000 – 40,000	కూరగాయ పంటలు	20,000 – 40,000
తమలపాకు	25,000 – 30,000	కర్రపెండలం	1,25,000 – 1,30,000
జీడిమామిడి	25,000 – 30,000	పూల సాగు	30,000 – 45,000
నిమ్మ/నారింజ	30,000 – 40,000	ఉద్యాన నర్సరీ	15,00,000 – 20,00,000
		పోక	42,000 – 43,000

జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశు సంవర్ధక శాఖల పరిధిలో పంటలు (ఎకరాకు), పశువులు, చేపల పెంపకానికి నిర్ధారించిన రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)

పంట రకం	స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (రూ.లలో)
వ్యవసాయ పంటలు	
ఖరీఫ్ వరి	38,000 – 45,000
రబీ వరి	42,000 – 49,000
జొన్న/మొక్కజొన్న	33,000 – 38,000
పెసలు, మినుము	17,000 – 20,000
వేరుశనగ	24,000 – 32,000
మత్స్యశాఖ	
వెనామీ	4,00,000 – 5,00,000
మంచినీటి చేపల చెరువు	1,50,000 – 2,00,000
చేపలు, రొయ్యలు	2,00,000 – 2,50,000
ఫంగస్ చేప, తిలాపియా	3,50,000 – 4,00,000
పీత	1,00,000 – 1,50,000
పండుగొప్ప	3,50,000 – 4,00,000
పాడి పరిశ్రమ	
ఆవులు (8–10 లీటర్లు)	33,000 – 35,000
గేదెలు (8–10 లీటర్లు)	40,000 – 45,000
మేకలు/గొర్రెలు (20+1)	41,000 – 44,000
బ్రాయిలర్ ఫార్మింగ్ (ఒక కోడికి)	180 – 200
లేయర్ ఫార్మింగ్ (ఒక కోడికి)	300 – 350







రుణ పరిమితి పెంచాం



రైతులకు మేలు చేసేలా రుణ పరిమితిని పెంచాం. చాలా పంటలకు గత ఏడాది కన్నా రుణ పరిమితిని పెంచడం జరిగింది. దీనికి అనుగుణంగా రైతులకు రుణాలు ఇవ్వడం ద్వారా వారు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా ఉంటారు. ఈ మేరకు బ్యాంకులకు సూచనలు ఇస్తాం. రైతుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నాం.

–ఎస్.నూపుర్ అజయ్, జాయింట్ కలెక్టర్

అప్పుల బాధలు తప్పుతాయి



పంట పెట్టుబడికి అవసరమైన రుణాలను బ్యాంకులు ఇస్తుండడంతో ప్రైవేట్ అప్పుల బాధలు చాలా వరకూ తగ్గాయి. దీనికితోడు ప్రభుత్వం రైతు భరోసా సాయం అందిస్తోంది. వరికి ఏటేటా పెరుగుతున్న పెట్టుబడులకు అనుగుణంగా బ్యాంకుల రుణ పరపతి పెంచడం అభినందనీయం.

–చిక్కం సీతారామప్రసాద్, రైతు, ఉప్పలగుప్తం

కౌలు రైతులకు మేలు



సాగుకు అవసరమైన రుణం బ్యాంకుల నుంచి వస్తే వడ్డీ భారం చాలా వరకూ తగ్గుతోంది. పెట్టుబడులకు తగినట్టుగా బ్యాంకులు రుణాలు ఇస్తే ప్రైవేట్ అప్పులు లేకుండా పోతాయి. ఇది రైతులకు మేలు చేసే అంశం. తద్వారా ధీమాగా సాగు చేసుకోవచ్చు.

–ఇల్లూరి వెంకటరమణ, పినపళ్ల, ఆలమూరు మండలం

వేదశాస్త్ర సన్మాన సభకు రూ.8 లక్షలు



రూ.8 లక్షల విరాళాన్ని శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ ప్రతినిధులకు అందజేస్తున్న కామేశ్వరీదేవి దంపతులు

అమలాపురం టౌన్: అమలాపురం వేదికగా శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ సంస్థ వేదాలను కాపాడుతూ వేద పండితులను ప్రోత్సహిస్తూ ఏటా వామన జయంతి రోజున ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి వేదసభను నిర్వహిస్తోంది. ఈ సభ ద్వారా వేదాలకు మరింత రక్షణ, ప్రాచుర్యం రావాలని ఆకాంక్షిస్తూ అమలాపురానికి చెందిన ప్రస్తుతం ఉద్యోగ రీత్యా కెనడాలో స్థిరపడిన ప్రయాగ కామేశ్వరీదేవి కుటుంబం రూ.8 లక్షల విరాళాన్ని సమకూర్చారు. 1963లో శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభకు అధ్యక్షుడిగా పనిచేసిన అమలాపురానికి చెందిన దివంగత డాక్టర్ కూర్మెళ్ల హరిహరస్వామి, గాయత్రీదేవి దంపతుల సంస్మరణార్థం వారి మనమరాలు కామేశ్వరీదేవి, ఆమె భర్త ప్రయాగ సన్యాసిరావు కుటుంబీకులు కెనడా దేశం నుంచి వచ్చి వేదశాస్త్ర సన్మాన సభకు ఈ విరాళాన్ని అందించారు. స్థానిక కూచిమంచి అగ్రహారంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో వేదశాస్త్ర సన్మాన సభ ఉపాధ్యక్షుడు విద్యాశంకర్ వంక, కార్యదర్శి గుళ్లపల్లి వెంకట్రామ్, కోశాధికారి యేడిది సుబ్రహ్మణ్య శర్మ, శిష్టా భాస్కర్, శిష్టా కుమార్‌శాస్త్రి సమక్షంలో కామేశ్వరీదేవి దంపతులు రూ.8 లక్షల చెక్కును అందజేశారు.

9న ఉద్యోగ మేళా

అమలాపురం రూరల్: అమలాపురంలోని కలెక్టరేట్ వికాస కార్యాలయంలో 9న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రకృతి వ్యవసాయం ప్రపంచానికే ఆదర్శం



వక్కలంకలో రైతులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జర్మనీ ప్రతినిధులు

అంబాజీపేట: రైతు సాధికారిక సంస్థ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆచరిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ప్రపంచానికే ఆదర్శమని డుట్సె గెసెల్లచాఫ్ ఫర్ ఇంటర్నేషనల్ జుసమ్మెన్నార్ట్ (డీజీఐజెడ్) ప్రతినిధి నవీన్ హురి అన్నారు. మంగళవారం వక్కలంకలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు, రసాయనిక వరి పొలాలను డీజీఐజెడ్ జర్మనీ సంస్థ, ఇంటర్నేషనల్ వరి పరిశోధనా స్థానం (ఐఆర్ఆర్ఐ), ఓలమ్ అగ్రి గ్లోబల్ మార్కెటింగ్ ప్రతినిధులు సందర్శించారు. జర్మనీ ప్రతినిధులకు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ జె.ఎలియాజర్ ఆధ్వర్యంలో ఇక్కడ ఆచరిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు వివరించారు. ఈ సందర్భంగా డీజీఐజెడ్ ప్రతినిధి నవీన్ హురి మాట్లాడుతూ జిల్లాలో ఆచరిస్తున్న మెరుగైన ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, పర్యావరణ మార్పులను తట్టుకునే సుస్థిరమైన వ్యవసాయాన్ని ప్రపంచ దేశాలు అధ్యాయనం చేస్తున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్ సీనియర్ కన్సల్టెంట్ డీవీ రాయుడు మాట్లాడుతూ అరవై ఏళ్లగా రైతులు మితిమీరిన రసాయనిక ఎరువులు, పురుగు మందులను వినియోగించడంతో భూమి, నీరు కలుషితం అవుతున్నాయన్నారు. ఆహారంలో పోషక లభ్యత క్షీణించిందన్నారు. ఎక్కువ శాతం నైట్రోజన్ ఎరువులు వినియోగంతో మిథైన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి వాయువులు విడుదలై వాతావరణ మార్పులకు కారణమవుతున్నాయన్నారు. దీనిని అరికట్టాలంటే ఏకైక మార్గం ప్రకృతి వ్యవసాయం అని అన్నారు. ప్రకృతి వ్యవసాయం అవలంబిస్తున్న రైతులు రాబోయే కాలానికి రథసారథులని తెలిపారు. అంతకు ముందు జర్మనీ సంస్థ ప్రతినిధులు సూహెలఖాన్, మాళవిక గోపీనాథ్, సాయి కిశోర్, సామిత చక్రవర్తి, ఎస్.రాకేష్, దక్ష మహిధర్, అంకితపాల్, విక్రమ్ పాటిల్, అంథోని, శరణ్య, అంకిత హాజరిక, సుదర్శన్ ఖకుర్, మధబరంద్రరాయ్‌లు రసాయనిక మందులతో సాగు చేస్తున్న రైతులు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో మాట్లాడారు. రసాయనిక వ్యవసాయంలో పాటించే పద్ధతులు, నీటి వినియోగం, సాగు ఖర్చు, ఆదాయాలు తదితర వివరాలను అడిగారు. ప్రకృతి, రసాయనిక వ్యవసాయాలకు మధ్య వ్యత్యాసాలను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రేవతి, ల్యాబ్ టెక్నీషియన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఆర్‌పీసీ అరుణ, ఏడీ డీపీఎం సత్యనారాయణ, ఏట శ్రీనివాస్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులదే కీలకపాత్ర

కలెక్టర్ హిమాన్షు శుక్లా



శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులదే కీలకపాత్ర అని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్ వద్ద సెక్టోరల్, పోలీసు అధికారులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక సెక్టోరల్ అధికారికి 10 నుంచి 12 పోలింగ్ కేంద్రాల పరిధి ఉంటుందన్నారు. వీరికి ఎన్నికల సమయంలో మెజిస్టీరియల్ అధికారాలు ఉంటాయన్నారు. తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని మూడు సార్లు సందర్శించి వసతులు, ఓటర్లకు అనుకూలతలను పరిశీలించాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచి ఎన్నికల కోడ్, ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి వసతుల విషయమై లోటుపాట్లు ఉంటే వెంటనే స్పందించాలన్నారు. తమ పరిధిలో రాజకీయ, శాంతిభద్రతల పరిస్థితులు ఎలా ఉన్నాయో పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి ఎన్నికలనూ కొత్తగానే చూడాలని, ఏ దశలోనూ ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయి వసతులు కల్పించాలని, దివ్యాంగులు, గర్భిణులు, వయో వృద్ధుల కోసం ర్యాంప్‌లు నిర్మించాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ఎటువంటి పార్టీ కార్యాలయం ఉండకుండా చూసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ అధికారులు చక్కని ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అన్నారు. ఓటు వేయడానికి వెళ్లే ఓటర్లను ఇబ్బంది పెట్టే వారి సమాచారాన్ని తమ దృష్టికి తెస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్, డీఆర్ఓ సీహెచ్ సత్తిబాబు, నియోజకవర్గాలకు చెందిన రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు

జాయింట్ కలెక్టర్ నూపుర్ అజయ్



జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ నూపుర్ అజయ్

అమలాపురం రూరల్: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ విజయవంతానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్ సూచించారు. మంగళవారం అమలాపురం కలెక్టరేట్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ 9న జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 3,06,833 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని లక్ష్యంగా నిర్దేశించామని అన్నారు. ఈ మాత్రలను ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించామని, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని పాఠశాలలకు మాత్రమే తరలించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. 9న మాత్రలు తీసుకోని పిల్లలకు 16వ తేదీన విధిగా అందించాలన్నారు. ఒకటి నుంచి రెండేళ్ల వయసు పిల్లలకు సగం మాత్ర, రెండు నుంచి 19 ఏళ్ల వయసు గల వారికి ఒక మాత్రను మింగించాలన్నారు. అనంతరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఆర్డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, డీఈఓ ఎం.కమలకుమారి, సాంఘిక సంక్షేమ సాధికార అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వై.సాంబమూర్తి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీహెచ్ భరతలక్ష్మి పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అయ్యేలా..

- గతేడాది జిల్లా స్థాయికి 279 ప్రాజెక్టుల ఎంపిక
- 14, 15 తేదీల్లో ఉమ్మడి జిల్లాలో ప్రదర్శనలు



గతేడాది జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టు (ఫైల్)

రాయవరం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు 'ఇన్‌స్పైర్ మనక్' ఉపకరిస్తోంది. వినూత్న ఆవిష్కరణలకు ఇది దోహదపడుతోంది. కేంద్ర ప్రభుత్వం ఏటా ఈ పురస్కారాలతో చిన్నారులను ప్రోత్సహిస్తోంది. 2022–23 విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు వారి ఆలోచనలకు పదును పెట్టి ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేశారు. ఇందులో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 279 ప్రాజెక్టులు ఎంపిక కాగా, సంబంధిత విద్యార్థుల ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో ప్రదర్శనకు జిల్లా సైన్స్ కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు.


రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం

2022–23 విద్యా సంవత్సరానికి ఉమ్మడి జిల్లా నుంచి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు 4,235 నామినేషన్లు పంపించగా, ఇందులో 279 ఎంపికయ్యాయి. రాష్ట్రంలో మన జిల్లా మూడో స్థానంలో నిలవడం గమనార్హం. ఎంపికైన ప్రాజెక్టులకు ప్రభుత్వం నుంచి రూ.10 వేల చొప్పున ప్రోత్సాహకాన్ని గత ఏడాది జూన్‌లో విద్యార్థుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేశారు. సైన్స్ సాంకేతిక రంగాలపై విద్యార్థులకు ఆసక్తి పెంచేలా కేంద్ర ప్రభుత్వం ఈ పోటీలను **నిర్వహిస్తోంది. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో భాగస్వాములయ్యారు. పర్యావరణ పరిరక్షణ, ఆధునాతన వ్యవసాయ విధానాలు, హెల్త్ న్యూట్రిషన్ వంటి అంశాలపై నూతన ఆవిష్కరణలు రూపొందించారు. ఆన్‌లైన్‌లో విద్యార్థులు సబ్మిట్ చేసిన నామినేషన్లలో 279 నామినేషన్లను** ఉత్తమమైనవిగా గుర్తించి ఎంపిక చేశారు.

ఎక్స్‌పోలకు తేదీల ప్రకటన

ఇన్‌స్పైర్ మనక్ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఈ నెల 14న, తూర్పుగోదావరి జిల్లాలో ఈ నెల 15న జిల్లా స్థాయి ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి 86, కోనసీమ నుంచి 72, కాకినాడజిల్లా నుంచి 136 ప్రాజెక్టులు ప్రదర్శిస్తారు. ప్రతి జిల్లా నుంచి ఉత్తమమైన 10 శాతం ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారు.


ఏర్పాట్లు వేగవంతం



ఇన్‌స్పైర్ మనక్ జిల్లా స్థాయి ప్రదర్శన అమలాపురం డివిజన్‌లో ఏర్పాటు చేస్తున్నాం. ప్రదర్శన విజయవంతం చేయడానికి జిల్లా విద్యాశాఖాధికారి నేతృత్వంలో కమిటీ నియమిస్తున్నాం. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు వేగవంతమయ్యేలా కమిటీ పర్యవేక్షిస్తుంది.

–జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, అమలాపురం


తప్పనిసరిగా ప్రదర్శించాలి



ఈ పోటీలకు ఎంపికైన ప్రాజెక్టులను తప్పనిసరిగా ఎగ్జిబిషన్‌కు తీసుకురావాలి. ఈ ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థుల వ్యక్తిగత ఖాతాలకు ఇప్పటికే నగదు జమ అయ్యింది. జమ కాకుంటే ఆ వివరాలను ప్రదర్శన రోజున జిల్లా సైన్స్ అధికారికి తెలపాలి.

–ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

సైన్స్‌పై ఆసక్తి కలిగేలా..



ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు ఎంపికైన ప్రతి ప్రాజెక్టును ఎగ్జిబిషన్‌కు తీసుకు రావాలి. ఆయా జిల్లాల సైన్స్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రదర్శనకు ఏర్పాట్లు చేయాలి. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి కలిగేలా ఇటువంటి ప్రదర్శనలు ఉపకరిస్తాయి.

–జి.నాగమణి, రీజినల్ జాయింట్ డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

క్లుప్తంగా

370 కిలోల గంజాయి స్వాధీనం

జగ్గంపేట: ప్రత్యేక కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న 370 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్ట్ చేశారు. మంగళవారం జగ్గంపేట సీఐ లక్ష్మణరావు తెలిపిన కథనం ప్రకారం.. ఒడిశాలోని చిత్రకొండ గ్రామానికి చెందిన మోటు వద్ద 370 కిలోల గంజాయిని హర్యానాకు చెందిన ఇబ్రహీం, జాన్ కొనుగోలు చేశారు. దీనిని గోనె సంచుల్లో నింపి గండేపల్లి మండలం మురారి వద్ద ఉన్న పోలవరం కాలువ వద్దకు మోటు ఆదివారం రాత్రి రహస్య మార్గాల ద్వారా చేర్చాడు. పోలవరం కాలువ వద్ద తుప్పల్లో ఉన్న గంజాయి సంచులను హర్యానాకు చెందిన ఇబ్రహీం, జాన్‌లు ఓ కంటైనర్ లారీలో ప్రత్యేకంగా అమర్చిన అరలో పెట్టి తరలిస్తుండగా, లారీ మరమ్మతులకు గురైంది. రామవరంలోని హర్యానా దాబా వద్దకు తీసుకువచ్చి రిపేరు చేయించడానికి లారీని ఉంచారు. గంజాయి సమాచారం అందుకున్న జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు తన సిబ్బందితో సోమవారం మధ్యాహ్నం తనిఖీలు చేసి పట్టుకున్నారు. నిందితులు ఇబ్రహీం, జాన్‌లను అరెస్టు చేశారు. అలాగే వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.1,500 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు సీఐ లక్ష్మణరావు వివరించారు.

బ్రహ్మోత్సవాల్లో అన్నదానానికి విరాళం


పెదపళ్లలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి విరాళం రశీదును అందజేస్తున్న దాత అన్నవరం

ఆలమూరు: చింతలూరులో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 29న ప్రారంభం కానున్న పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో అన్నసమారాధనకు మంగళవారం ఓ దాత విరాళం అందించారు. గుమ్మిలేరుకు చెందిన పారిశ్రామికవేత్త, శ్రీకృష్ణ ప్రభాస్ సంస్థల అధినేత వంక సత్యనారాయణ (అన్నవరం) సుమారు రూ.1.80 లక్షల విలువైన 108 సంచుల బియ్యాన్ని విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు బియ్యం రశీదును పెదపళ్లలోని శ్రీకృష్ణతేజ రైసుమిల్లు ఆవరణలో ఆయన ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. అనంతరం ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య దాత అన్నవరం కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ బియ్యం వితరణతో బ్రహ్మోత్సవాలు ముగిసే వరకూ సుమారు 15 వేల మందికి అన్నసమారాధన నిర్వహించవచ్చని ఆలయ కమిటీ తెలిపింది. వ్యాపారవేత్త వైట్ల దుర్గారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు అల్లం రాజు భరణీ, నామాల రామకృష్ణ, ద్విభాష్యం కాశీ విశ్వనాథశర్మ తదితరులు పాల్గొన్నారు.


తుని బ్యాంక్ కాలనీ మున్సిపల్ పాఠశాల భవనం (నాడు)


అభివృద్ధి చేసిన తర్వాత (నేడు)


కొత్తగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ భవనం

పురపాలన ప్రగతి పాలన

ప్రగతుని చాటేలా..

- అభివృద్ధిలో ఆకాశమంత ఎత్తుకు..
- నాలుగున్నరేళ్లలో రూ.వందల కోట్లతో పనులు
- 'నాడు–నేడు'లో స్కూళ్లు, రోడ్లు, పార్కులకు మహర్దశ
- సీఎం జగన్ పాలనకు నిలువెత్తు నిదర్శనం


గణపతినగర్ పార్కులో ఆకట్టుకునేలా నిర్మాణం


తుని పట్టణం ఏరియల్ వ్యూ

తుని: అభివృద్ధికి అగ్రతాంబూలం ఇచ్చారు.. తుని పురపాలక సంఘాన్ని అందలమెక్కించారు.. అన్ని అంశాల్లోనూ ప్రగతికి ఐకాన్‌గా నిలిపారు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కాకినాడ జిల్లా తుని పురపాలక సంఘాన్ని అన్నింటా ఆదర్శంగా తీర్చిదిద్దారు. అధినేత ఆదేశాలను అనుసరించి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా కేవలం మున్సిపల్ నిధులకే పరిమితం కాకుండా కేంద్ర ప్రభుత్వ నిధులను రాబట్టి పలు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించారు. అభివృద్ధి అంటే ఇదేనని చేసి చూపించారు. నాలుగున్నరేళ్లలో కనీవినీ ఎరుగని రీతిలో తుని పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తయారు చేశారు. ఆ వివరాలు తెలుసుకుందాం రండి..

తుని పట్టణంలో పలు ప్రాంతాలు చిన్నపాటి చినుకులకే ముంపునకు గురయ్యేవి. ఏళ్ల కాలంగా సమస్య ఉన్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ముంపు ప్రాంతాల్లో సీసీ రోడ్లను నిర్మించి సమస్యకు పరిష్కారం చూపారు. ఇక్కడ మొత్తం 30 వార్డుల్లో రూ.11.42 కోట్లతో 106 సీసీ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు పూర్తి చేశారు. 20, 21 వార్డులకు సంబంధించి ఇసుకలపేట నుంచి ఉప్పరగూడెం వైఎస్సార్ నగర్ కాలనీ వరకూ రూ.1.20 కోట్లతో 1.8 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మించారు. 22, 25 వార్డులకు సంబంధించి రూ.1.25 కోట్లతో పన్నెండు అంతర్గత సీసీ రహదారులు వేశారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.నాలుగు కోట్లతో 40 కొత్త డ్రైన్ల నిర్మాణం జరుగుతోంది. ఇవి పూర్తయితే మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తోంది.

నిధులు.. చేసిన పనులు

- తుని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పైపులైన్ల నిర్మాణానికి 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.28 కోట్లు ఖర్చు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకంలో అమృత్ 2.0 కింద రూ.13.44 కోట్లతో పైపులైన్లు, రిజర్వాయర్ల నిర్మాణం జరుగుతోంది.
- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నాడు–నేడు' పథకంలో పాఠశాలల అభివృద్ధి కోసం రూ.5.54 కోట్లు ఖర్చు చేశారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలిక వసతులు, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించారు.
- పట్టణంలోని రెండు పార్కులను రూ.2.64 కోట్లతో సుందరంగా తయారు చేశారు. 14, 15 ఆర్థిక సంఘం, బీపీఎస్, ఎంపీ నిధులతో రాజా రాజబాబు మున్సిపల్ పార్కు, గణపతినగర్ పార్కులను తీర్చిదిద్దారు. ఇవి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.
- ప్రజారోగ్యం కోసం అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని రూ.90 లక్షలతో నిర్మించి, పాత భవనానికి మరమ్మతులు చేశారు.
- ప్రజల అవసరాల కోసం రూ.30 లక్షలతో రెండు సామాజిక భవనాలను నిర్మించారు.
- పారిశుధ్యం మెరుగుకు స్వచ్ఛ భారత్ పథకంలో 9 ఎలక్ట్రికల్ ఆటోలను అందుబాటులోకి తీసుకువచ్చారు. 30 వార్డుల్లో తడి, పొడి చెత్తను వేరు చేయడానికి రూ.30 లక్షలతో మూడు రకాల డస్ట్ బిన్‌లను ప్రజలకు అందజేశారు. చెత్త సేకరణలో ఇది నూతన అధ్యాయం.
- పట్టణంలో మొత్తం 14 సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఇందులో 82 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. 316 మంది వలంటీర్లు ఉన్నారు. అధికారుల లెక్కల ప్రకారం సచివాలయాల పరిధిలో 52 వేల మంది వివిధ సేవలు పొందారు.
- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నాలుగు సచివాలయాలకు రూ.80 లక్షల నిధులు విడుదల చేశారు. వీటితో ఆయా వార్డుల్లో సీసీ రోడ్లు, కాలువలను నిర్మించారు.
- అందరికీ ఇళ్లు పథకంలో 4,716 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. తుని మండలం రాజుపేటలోని జగనన్న లేఅవుట్‌లో రూ.82.76 కోట్లతో స్థలం ఫిల్లింగ్, రోడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పించారు.
- నాన్ డీబీటీ కింద మొత్తం 30,042 మంది లబ్ధిదారులకు రూ.182,03,26,455 సొమ్ము అందజేశారు.

తుని మున్సిపాలిటీ ఆవిర్భావం	1,959
విస్తీర్ణం	7.02 చదరపు కిలోమీటర్లు
మొత్తం వార్డులు	30
జనాభా	53,425
పురుషులు	25,992
మహిళలు	27,503
ఓటర్లు	42,387
గృహాలు	14,439

మున్సిపాలిటీలో నాలుగున్నరేళ్లలో పథకాలు, లబ్ధిదారుల వివరాలు

పథకం	లబ్ధిదారులు	జరిగిన లబ్ధి (రూ.)
అమ్మ ఒడి	5,191	22,71,88,268
జగనన్న విద్యాదీవెన	3,371	104857927
జగనన్న వసతి దీవెన	2,605	4,40,39,442
రైతు భరోసా	2,361	11,43,85,050
పంటల బీమా	339	56,49,582
సున్నావడ్డీ పంట రుణాలు	421	12,21,022
ఇన్‌పుట్ సబ్సిడీ	480	29,77,798
మత్స్యకార భరోసా	110	19,50,000
వైఎస్సార్ పెన్షన్ కానుక	6,582	62,92,20,750
వైఎస్సార్ చేయూత	2,504	10,96,87,500
వైఎస్సార్ ఆసరా	7,292	16,90,86,673
డ్వాక్రా సున్నా వడ్డీ	9,041	2,49,92,348
కాపు నేస్తం	1,540	3,75,60,000
ఈబీసీ నేస్తం	412	88,95,000
కల్యాణమస్తు	09	77,5000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	2,032	9,45,62,661
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	1,408	88,61,675
గృహ నిర్మాణం	2,305	14,46,68,843
వైఎస్సార్ బీమా	160	2,21,95,000
వైఎస్సార్ వాహనమిత్ర	168	44,40,000
నేతన్న నేస్తం	01	72,000
చేదోడు	498	1,19,90,000

ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం..



గత ఎన్నికల సమయంలో పట్టణ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం. పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందజేశాం. 4,716 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి, ప్రభుత్వ పరంగా గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేశాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పట్టణంలో 106 సీసీ రోడ్లు నిర్మించాం. పార్కులు, కాలువల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చాం. తుని మున్సిపాలిటీని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడం ఆనందంగా ఉంది.

–దాడిశెట్టి రాజా, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి, తుని

అగ్రగామిగా నిలిపాం



పట్టణాన్ని అన్నివిధాలా అగ్రగామిగా నిలిపాం. అందరికీ తాగునీరు, మెరుగైన పారిశుధ్యానికి పెద్దపీట వేశాం. పట్టణంలో రోడ్లు, కాలువలు, కల్వర్టులు, పార్కులను రూ.కోట్లతో నిర్మించాం. సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని సేవలు అందుబాటులోకి తీసుకువచ్చాం. ప్రజాప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రముఖుల సహకారంతో ఇది చేయగలిగాం.

–బీజేఎస్ ప్రసాదరాజు, కమిషనర్, తుని

కొట్లాట కేసులో ఇద్దరికి జైలు

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి గ్రామంలో కొట్లాట కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలుశిక్ష, మరొకరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ నిడదవోలు జూనియర్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ తీర్పు చెప్పినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ మంగళవారం తెలిపారు. కోరుమామిడిలో 2021 అక్టోబర్ 24న ప్రత్తిపాటి అన్నమ్మను అదే గ్రామానికి చెందిన ముగ్గురు అసభ్య పదజాలంతో దూషించి కొట్టి గాయపర్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సుభానీ కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో అదే గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు సుబ్రహ్మణ్యం, గెల్లా శివప్రసాద్‌లకు రెండేళ్ల సాధారణ జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా, పసలపూడి రమేష్‌కు రూ.10 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పినట్లు ఎస్సై తెలిపారు.

వేదాల పరిరక్షణ అందరి బాధ్యత

బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ


సభలో భక్తులు, విద్వాంసులు


ప్రవచిస్తున్న బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

పి.గన్నవరం: వేదాలపై మన సంస్కృతి ఆధారపడిందని, వీటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. మంగళవారం ముంగండ గ్రామంలోని చింతామణి గణపతి మందిరంలో శ్రీఅశ్వలాయన మహర్షి రుగ్వేద పరిషత్ ఆధ్వర్యంలో రుగ్వేద పారాయణ, వేద విద్వత్ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ప్రవచిస్తూ వేదం లోకాన్ని సంరక్షిస్తుందన్నారు. వేదాలతో సర్వమానవాళి, ఇతర ప్రాణులు సుభిక్షంగా ఉంటాయన్నారు. వీటి ప్రాశస్త్యం, వేద పరిరక్షణ ఆవశ్యకతను షణ్ముఖశర్మ వివరించారు. ఉదయం నుంచి వేద విద్వాంసులచే రుగ్వేద సంహిత పారాయణ జరిగింది. ఆయా కార్యక్రమాల్లో శ్రీఅశ్వలాయన మహర్షి రుగ్వేద పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోదావరి వెంకట సుబ్బారావు, చెరుకూరి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్, సహ కార్యదర్శి గంటి సుబ్రహ్మణ్య శాస్త్రి, సభ్యులు, వేద రక్షకులు పాల్గొన్నారు.

గిరిజనులకు ప్రాధాన్యమిచ్చే పార్టీకే మద్దతు


సంఘీభావం తెలియజేస్తున్న టీఎస్ఎఫ్ ప్రతినిధులు

రాజానగరం: గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే పార్టీకే వచ్చే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ప్రకటించింది. స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజులపాటు జరిగిన జాతీయ గిరిజన సాంస్కృతిక మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లి భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప, కార్యదర్శి విష్ణునాయక్ మాట్లాడుతూ గిరిజనులకు రాజ్యసభ సీటు, మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ పదవులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, రామరాజు, రఘు, మల్లికార్జున నాయక్, వినోద్ నాయక్, హరినాయక్, వెంకటరమణ, శివాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో కొండముచ్చుల దాడి

25 మందికి గాయాలు


దాడి చేసిన కొండముచ్చు


కొండముచ్చు దాడిలో మహిళ చేతికి గాయం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కొండముచ్చుల దాడితో జనం బెంబేలెత్తిపోతున్నారు. రెండు రోజులుగా 20 మంది గాయపడగా, ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అటవీ శాఖాధికారులు వీటిని పట్టుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. చేబ్రోలు శివారు తోటల్లో ఉండే కొండముచ్చులు అప్పుడప్పుడు గ్రామంలోకి వచ్చి తిరుగుతుంటాయి. ఇవి రెండు రోజులుగా మనుషులపై దాడికి దిగుతున్నాయి. ఈ దాడిలో బదిరెడ్డి అమ్మాజీ, చేదులూరి భూలక్ష్మి, కర్రి చిలకమ్మ, నిమ్మల చక్రబద్దినీడి మంగదీప, కర్రి కనకరత్నం తదితరులతో పాటు మరో 15 మందికి పైగా గాయపడ్డారు. వీరికి స్థానిక పీహెచ్‌సీలో చికిత్స అందించగా, తీవ్ర గాయాలైన వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని ఎంపీ గీతకు జెడ్పీటీసీ సభ్యుడు వులవకాయల నాగలోవరాజు వివరించారు. అటవీ శాఖాధికారులతో ఆమె మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు 10 వరకూ కొండముచ్చులు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం అవి గ్రామ శివారు ప్రాంతాల్లో ఉన్నాయని, వాటిని పట్టుకునే ప్రయత్నిస్తున్నామని అటవీశాఖ అధికారులు వై.బాబూరావు, పి.లావణ్య, ఆర్.నాగేశ్వరరావు తదితరులు తెలిపారు.

29లోగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలి

ఏలూరు జోన్–2 కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ రాణి


సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు జోన్–2 జేసీఎల్ ఎ.రాణి

ఏలూరు (టూటౌన్): కార్మిక శాఖ జోన్–2 ఏలూరు పరిధిలోని ఏడు జిల్లాల్లో దుకాణాలు, వాణిజ్య, వ్యాపార సంస్థలు, మోటారు రవాణా యాజమాన్యాలు, కార్మికులను వినియోగించే కాంట్రాక్టర్లు ఈ నెల 29లోగా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని ఏలూరు జోన్–2 కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎ.రాణి కోరారు. ఏలూరు అశోక్‌నగర్‌లోని జేసీఎల్ కార్యాలయంలో వివిధ వర్తక, వాణిజ్య యాజమాన్య సంఘాలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జోన్–2 పరిధిలో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు, మోటారు రవాణా యాజమాన్యాలు గతంలోనే ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉంటే రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. గతంలో విడివిడిగా కాకుండా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం 2015 కింద కార్మిక చట్టాలన్నింటికీ ఒకే రిజిస్ట్రేషన్/లైసెన్స్ పొందే వెసులుబాటు ఉందన్నారు. ఈ చట్టం కింద సంస్థల రిజిస్ట్రేషన్/రెన్యువల్ కోసం యజమానులు లేదా కాంట్రాక్టర్లు సమీపంలోని మీ–సేవ కేంద్రాలు, సీఎస్‌సీ సెంటర్లు, గ్రామ/వార్డు సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. ప్రతి వర్తక యాజమాన్య సంఘాలు దుకాణం లేదా సంస్థ యజమానులకు లైసెన్స్, రిజిస్ట్రేషన్, నవీకరణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నమోదు ప్రక్రియ వేగవంతం చేసి విజయవంతం చేయాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. డీసీఎల్ పి.శ్రీనివాస్, ఏసీఎల్‌లు జి.నాగేశ్వరరావు, టీవీవీఏఎస్ మూర్తి, సహాయ కార్మిక అధికారులు జి.వెంకటరమణ, జె.గోపాలకృష్ణ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏలూరు అధ్యక్షుడు నేరేళ్ల రాజేంద్ర, కిరాణా మర్చంట్ అసోసియేషన్ నాయకుడు బాలకృష్ణ, మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి బ్రహ్మయ్య, మెటల్ అసోసియేషన్ ప్రతినిధి సీహెచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

- అన్నదమ్ములే నిందితులు
- చివరికి కటకటాలపాలు
- ఐదు మోటార్ సైకిళ్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు, నిందితులతో పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వారిద్దరూ అన్నదమ్ములు.. జల్సాలకు అలవాటు పడ్డారు.. చోరీలు చేస్తూ తమ అవసరాలు తీర్చుకునేవారు.. చివరికి పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు.. దీనిపై పోలీసుల కథనం ప్రకారం.. జిల్లాలో కొంతకాలంగా ఖరీదైన మోటారు సైకిళ్లు చోరీకి గురవుతున్నాయి. వీటిపై ఆయా పోలీస్ స్టేషన్ల పరిధుల్లో కేసులు నమోదవుతున్నాయి. దీనిని సీరియస్‌గా తీసుకున్న జిల్లా ఎస్పీ పి.జగదీష్ డీఎస్పీ విజయ్‌పాల్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. నిఘా పెట్టిన పోలీసు బృందం గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన తోట రాజు, తోట నాగభూషణంను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.4 లక్షల విలువైన 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుంది. తోట రాజు, నాగభూషణం ఇద్దరూ అన్నదమ్ములు. వీరు జల్సాలకు అలవాటు పడ్డారు. రెండేళ్ల కిందట వీరు రాజమహేంద్రవరం వీఎల్ పురం వచ్చి ఓ బాలుడితో కలసి మోటారు సైకిళ్ల దొంగతనాలు చేసేవారు. వీరి కదలికలపై నిఘా పెట్టిన ప్రత్యేక పోలీసు బృందం చాకచక్యంగా పట్టుకుంది. ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 4, బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 1 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అన్నదమ్ములిద్దరినీ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బాలుడిని జువైనల్ కోర్టుకు తరలించారు. నిందితులను చాకచక్యంగా పట్టుకుని వారి నుంచి మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్ సత్యనారాయణ, ఎస్సైలు ప్రేమ్‌రాజ్, హరిబాబు, కానిస్టేబుళ్లు నాగరాజు, పోసిరాజు, శేషు, హోంగార్డ్ సూరిబాబులను జిల్లా ఎస్పీ అభినందించారు.